క్లుప్తంగా

సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సదాశివపేట(సంగారెడ్డి): దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను సంఘటిత, అసంఘటిత కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు విజయవంతం చేయాలని సీఐటీయూ సదాశివపేట కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని వలు పరిశ్రమల వద్ద కార్మికులకు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మిక చట్టాలను ఎత్తివేశారని వాటిని వెంటనే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

ఝరాసంగం(జహీరాబాద్): ఐకేపీల్లో వీఓఏలుగా విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేడు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఐకేపీ వీఓఏలు పాల్గొంటున్నట్లు తెలుపుతూ సమ్మె నోటీస్ ఐకేపీ ఏపీఎం టిక్యానాయక్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను పునరుద్ధరించి కనీస వేతనం నెలకు రూ. 26వేలు నిర్ణయించాలన్నారు. సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో మండల విఓఏలు రాజపతి, వీరస్వామి, రాజు, మహమ్మద్, షఫీఉద్దీన్, నర్సింలు, నాగరాణి, అనిత, ఉమారాణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ అబ్దుల్ వాసే సీహెచ్ఓ ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి లో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అసంక్రమిత వ్యాధుల నిర్వహణ కార్యక్రమాన్ని చేపడుతున్న ప్రక్రియపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వైద్య బృందానికి తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి కోమలి, సిబ్బంది పాల్గొన్నారు.


మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలి



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న జగ్జీవన్

నారాయణఖేడ్: ప్రజామరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ నిర్వాహకులను ఆదేశించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా మరుగుదొడ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు శుభ్ర పరుస్తూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రోడ్డుపక్కన ఉన్నందున ట్రాఫిక్‌కు ఆటంకాలు కలుగకుండా చూడాలన్నారు. పలుకాలనీల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మేనేజరు వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డుల అధికారులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్లకు వీడ్కోలు



అధికారులను సన్మానిస్తున్న రోజా, చంద్రారెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 30 సంవత్సరాలుగా బిల్ కలెక్టర్లుగా బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ చేస్తున్న నారాయణ, మహబూబ్ అలీల సేవలు ప్రశంసనీయమని మున్సిపల్ కమిషనర్ కిషన్ అన్నారు. మంగళవారం పురపాలిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో బిల్ కలెక్టర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. శ్లోక పాఠశాలలో జరిగిన వీడ్కోలు సభలో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ రోజా బాల్‌రెడ్డి బిల్ కలెక్టర్లు ఇద్దరిని ప్రశంసిస్తూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్ఓ నర్సింలు, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా?

నిర్వహణ లోపంతో విద్యుత్ ప్రమాదాలు

- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు
- వేలాడుతున్న విద్యుత్తు తీగలు, ఒరిగిన స్తంభాలు సరిచేయాలని వినతి

ఝరాసంగం(జహీరాబాద్): ప్రమాదాలు జరిగితేనే విద్యుత్ అధికారులు స్పందిస్తారా.. అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ, పట్టింపులేని తనంతో ప్రజలు నిత్యం విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నారు. వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలతో రైతులు నానాఅవస్థలు పడుతున్నారు.

☛ మండల పరిధి బిడెకన్నె గ్రామ శివారులో రైతు పంట పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం పూర్తిగా ఒక పక్కకు ఒరిగింది. దీంతో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్వయానా రైతు కర్ర సహాయంతో విద్యుత్ తీగలను పైకి అమర్చుకున్నాడు.

పొలాల్లో పొంచి ఉన్న ప్రమాదం

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. మండలంలో అనేకచోట్ల ప్రమాదాలు జరిగేలా విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. విద్యుత్ సరఫరా చేసేందుకు పొలాల మధ్య నుంచి స్తంభాలను ఏర్పాటు చేశారు. వ్యవసాయ పనులు చేసే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో రైతులు భయంతో పనులు సాగిస్తున్నారు.



తక్కువ ఎత్తులో తీగలు ఉండటంతో కర్ర ఏర్పాటు

☛ బిడెకన్నె గ్రామం నుంచి రాయిపల్లి గ్రామం వెళ్లే రహదారి పక్కన ప్రణాళికబద్ధంగా పనులు చేపట్టలేకపోయారు. సబ్‌స్టేషన్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు సరఫరా చేసే 11 కేవీ లైన్‌ను ఏర్పాటు చేశారు. దాని కింద నుంచే ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా వ్యవసాయ బోర్లకు సరఫరా చేసే ఎల్‌టీ విద్యుత్తు లైన్‌ను ఏర్పాటు చేశారు. పైన కింద ఉన్న విద్యుత్ తీగలు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుంది. అంతేకాకుండా బోర్లు కాలిపోతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో కర్రలు, డ్రిప్ పైపులు, రాళ్ల సహాయంతో విద్యుత్తు తీగలు తగలకుండా రైతులే ఏర్పాటు చేసుకున్నారు.

☛ మండల పరిధిలోని కష్టాపూర్ గ్రామంలో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న ఇంటి పైకప్పుకు విద్యుత్తు తీగలు తగులుతున్నాయి. వర్షాకాలం సమయంలో విద్యుత్ షాక్ వస్తుంది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో వారే కర్రల సహాయంతో స్లాబ్‌కు తగలకుండా ఏర్పాటు చేసుకున్నారు.

పట్టించుకోని అధికారులు

విద్యుత్ సమస్యలతో ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామం పేరు చెప్పి అధికారులకు ఫిర్యాదు చేస్తే.. ఆ గ్రామం ఏ మండల పరిధిలోకి వస్తుందని అడగడం విడ్డూరంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకొని వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేసి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



కృష్ణాపూర్‌లో ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

రైతు కార్డుతో ప్రయోజనాలు

ఏఓ శ్రీనివాస్ గౌడ్

కంది (సంగారెడ్డి): ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రైతు కార్డులు ద్వారా ప్రయోజనం కలుగుతోందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మంగళవారం కందిలోని రైతు వేదికలో కొనసాగుతున్న రైతు కార్డు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూములు కలిగిన వారందరూ రైతు కార్డు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్డులు కలిగి ఉన్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే సబ్సిడీలు రుణాలు సక్రమంగా అందే అవకాశం ఉంటుందన్నారు. భూములు కలిగిన వారందరూ తమ ఆధార్ కార్డు పట్టా పాస్‌బుక్ జిరాక్స్‌లతో మండల వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలన్నారు. కంది మండలంలో 25 వేల ఎకరాలకు పైగా భూమి ఉండ గా ప్రస్తుతం సాగులో 20వేల ఎకరాలు ఉందన్నారు. 5 వేల ఎకరాలకు పైగా ఉన్న భూమిని వ్యవసాయ యేతర భూమిగా మార్చి వెంచర్లు ఏర్పాటు చేశారు. ఇలాంటి భూములకు రైతు కార్డులు జారీ చేయరని చెప్పారు. మండలంలో 15,752 మంది రైతులు ఉండగా ఇప్పటివరకు 3200 మంది కార్డులు పొందినట్లు వివరించారు. మిగతా వారు కూడా తమ పేర్లను నమోదు చేసుకొని రైతు కార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో సంగీత, బీనా, లోహిత, రైతులు పాల్గొన్నారు.



పేర్లను నమోదు చేసుకుంటున్న రైతులు

ఆయిల్ పామ్‌తో లాభాలు

పుల్‌కల్(అందోల్): ఆయిల్ పామ్ పంటతో అధిక దిగుబడులు సాధించాలని పుల్‌కల్ ఏఓ చైతన్య రైతులకు సూచించారు. మంగళవారం పుల్‌కల్ రైతువేదికలో ఆయిల్ పామ్ అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం పలు రాయితీలు కల్పించిందని తెలిపారు. ఎకరాలో 57 ఆయిల్ పామ్ మొక్కలు నాటితే ప్రభుత్వం రూ.11600 రాయితీ, డ్రిప్‌కు 22000 రాయితీ ఇస్తుందని చెప్పారు. ఆయిల్ పామ్ పంట వేసిన రైతులకు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఈఓ అంజు, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధులు సమత, శివరాం, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెట్టండి

సదాశివపేట(సంగారెడ్డి): ఆయిల్ పామ్ పంటలను సాగుచేసుకుని అధిక లాభాలు పొందాలని ఉద్యానవన మండల ఉద్యానవన అధికారి సునీత రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మద్దికుంట గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పండ్లు కూరగాయలు, పూలను పెంచే రైతులకు ఉద్యానవన శాఖ రాయితీలను అందిస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు ఎకరానికి 50 వేల సబ్సిడీని వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి సునీత, మద్దికుంట పంచాయతీ కార్యదర్శి గాయత్రి ఆయిల్‌ఫామ్ అధికారి ఈశ్వర్, ఈపీసీ డ్రిప్ ప్రతినిధి స్వామి మద్దికుంట గ్రామ రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పట్టుదలతో మంచి మార్కులు సాధించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి విద్యార్థి పట్టుదలతో చదువుకుని మంచి మార్కులు సాధించాలని మండల విద్యాధికారి పీపీ రాథోడ్ అన్నారు. మంగళవారం తెల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండేలా శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పదవ తరగతి విద్యార్థులు పాఠశాలలో నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కావాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా ఐదుగురికి రూ.వెయ్యి, మరో నలుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రాంసింగ్‌తో మాట్లాడుతున్న అజయ్‌కుమార్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్రూం (కేసీఆర్ నగర్)కాలనీలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్‌రెడ్డి పర్యటించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. నూతనంగా మంజూరైన ప్రభుత్వ పాఠశాల తరగతి గదుల ఏర్పాటుకు షటర్లను ఆయన పరిశీలించారు. కొల్లూరులోని చెత్త డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. అలాగే, ఉస్మాన్‌నగర్, ఈదులనాగులపల్లిలో పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో తెల్లాపూర్ మున్సిపల్ ముందుకు దూసుకుపోతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.

మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రకాష్‌రావు

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా మురళీకృష్ణ

సంగారెడ్డి : సంగారెడ్డిలోని మెడికల్ కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా ప్రకాష్ రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా మురళీకృష్ణకు పోస్టింగు ఇచ్చారు. ఇప్పటివరకు ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ అనిల్‌కుమార్ ఆయన పోస్టులో కొనసాగనున్నారు.

మహానేతకు ఘన నివాళి

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, రీయింబర్స్‌మెంట్‌ను ప్రవేశపెట్టి సామాన్య జనాల గుండెలో నిలిచిపోయిన నాయకుడు వైఎస్ అని కొనియాడారు.



సంగారెడ్డి: వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్, నాయకులు



నారాయణఖేడ్:నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు



హోతి(బి) గ్రామంలో కేక్‌కట్ చేసి తినిపిస్తున్న నాయకులు

టేకూర్‌లో పీర్ల ఊరేగింపు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని టేకూర్ గ్రామంలో మొహర్రం ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. జిల్లాలోని మందాపూర్, చినిగెపల్లి, ఒక్కరేణి, కాపులాపూర్, ఏటిగడ్డ ఎల్గోయి, ఉషిర్కపల్లి, సింధోల్, ధర్మాపూర్, ఉక్రనా, నల్లవాగు, బదాల్‌గావ్, నాగుపల్లి ప్రాంతాలకు చెందిన ప్రజలు దూదిపీర్లతో గ్రామానికి తరలివచ్చారు. గ్రామం సమీపంలోని గుట్టపై గుహాలోని మైబుసుభాని దర్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బాజా భజంత్రీలతో నత్యాలు చేస్తూ గ్రామ ప్రధాన కూడలి వద్దకు వెళ్లారు. అక్కడ గల ఆషుర్‌ఖానా వద్ద ఉంచిన దూది పీర్లను ప్రజలు కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు ప్రజలతో కిటకిటలాడాయి. ప్రధాన కూడలి వద్ద ప్రజలు ఆడిన ఆటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రుమాళ్ల ఆట ప్రజలను ఆకట్టుకుంది. ఎలాంటి అవాంఛనీయ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మొహర్రం ఉత్సవాల్లో స్వల్ప ఉద్రిక్తత

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి టేకూర్ గ్రామంలో కొనసాగుతున్న మొహర్రం ఉత్సవాల్లో మంగళవారం స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. బందోబస్తులో భాగంగా ఎస్ఐ చల్లా రాజశేఖర్ సిబ్బందితో గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన ఉన్న బావిలో కొందరు యువకులు ఈత కొడుతున్నారు. వారిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. గ్రామంలోకి వెళ్లిన యువకులు జరిగిన విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలిపారు. ఆగ్రహించిన వారు పోలీసు వాహనాన్ని అడ్డుకుని ఎస్ఐ, పోలీసులతో వాగ్విదానికి దిగారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామస్తులు కలుగజేసుకొని సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది.



ఆశుర్‌ఖాన పీర్లతో తరలివస్తున్న ప్రజలు

పండ్ల చెట్లతో పర్యావరణానికి మేలు

సీఐ వెంకటేశం



మొక్కలు నాటినీరు పోస్తున్న సీఐ వెంకటేశం, ప్రిన్సిపాల్

సదాశివపేట(సంగారెడ్డి): పండ్ల చెట్లు గాలిని శుద్ధి చేయడంతో పాటు నీటిని నిలుపుకుంటూ మట్టిని సంరక్షిస్తాయని పండ్ల చెట్లు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని సీఐ వెంకటేశం పేర్కొన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో తెల్లనేరేడు, జామ, సీతాఫలం, పనస ఇతర పండ్ల మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండ్లు ఆహారం, ఔషధం, ఇతర ఉత్పత్తుల కోసం ఉపయోగిస్తారన్నారు. పండ్ల చెట్ల బెరడు ఆకులు, గింజలు ఔషధాల తయారీలో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బంగ్ల భారతి, వైస్ ప్రిన్సిపాల్ సిద్దులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి పి.మురళీకృష్ణ, అధ్యాపకులు సర్వయ్య, రాజిరెడ్డి, సావిద్య, శంకరయ్య ఎన్ఎస్ఎస్ సీ సర్టిఫికేట్ హోల్డర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలతో ఆర్థిక ఎదుగుదల



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం రమేష్

రాయికోడ్(అందోల్): ప్రభుత్వం అందించే వడ్డీలేని రుణాలతో స్వయం సహాయక సంఘాల మహిళా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని డీపీఎం రమేశ్, ఏపీఎం నర్సింలు అన్నారు. రాయికోడ్‌లోని ఇందిర క్రాంతి భవనంలో మంగళవారం 'ఇందిర మహిళా శక్తి సంబరాలు'లో భాగంగా మండల సమాఖ్య నాయకులు, ఆయా గ్రామాల గ్రామ సంఘాల అధ్యక్షులు, వీఓఏలు, సీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలతో ఆస్తులను సృష్టించాలన్నారు. తద్వారా సకాలంలో చెల్లింపులు చేయవచ్చన్నారు. ఈ ఏడాది బ్యాంకు లింకేజీ ద్వారా సంఘాలకు రూ.5 కోట్ల రుణాలందాయన్నారు. స్త్రీనిధి రుణాల చెల్లింపులు మెరుగుపడేలా చూడాలన్నారు. ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు, చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అంబిక, వీరమణి, సీసీలు హన్మంత్‌రెడ్డి, నర్సింలు, యాదప్ప తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 10వబ్లాక్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రైనేజీ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. మ్యాన్‌హోల్ సరిగ్గా నిర్మించడం లేదని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. అలాగే, మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ పుష్ప ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల10 నుంచి 25వతేదీ వరకు జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటి ఇంటికి ఉచిత మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, ఉప కమిషనర్ సురేశ్, డాక్టర్ కల్పన, ఎంటమాలజీ ఏఈ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

శిఖం భూములు ఆక్రమిస్తే చర్యలు



శిఖం భూములను పరిశీలిస్తున్న అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అయ్యమ్మ చెరువు శిఖం భూములు ఆక్రమణలకు పాల్పడుతున్నారని వచ్చిన ఫిర్యాదులపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు స్పందించారు. మంగళవారం ఆక్రమణలకు గురైన స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, ఆర్ఐ జయప్రకాష్ నారాయణ, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్ సంయుక్తంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి శిఖం భూములను కబ్జా చేస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్ఐ పేర్కొన్నారు. చెరువులు, కుంటలను కబ్జాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వేయర్ సంగీత, మున్సిపల్ వాసులు, పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై చైతన్యం

ఓటరు నమోదు అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్: అర్హులు ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు ఓటర్ నమోదు అధికారి దేవుజా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో బీఎల్‌ఓల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీఎల్‌ఓలు, బూత్‌స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తారని, పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని తామై చూసుకుంటారని తెలిపారు. ఓటర్లకు ఎన్నికల సంఘానికి అను సంధానకర్తలుగా వ్యవహరిస్తారన్నారు. ఓటర్ల జాబితా తయారీలో మార్పులు చేర్పులు సవరణలు చేసే బాధ్యత బీఎల్‌ఓలపై ఉంటుందన్నారు. తాజాగా బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సిద్ధమైందన్నారు. ఎన్నికల సంఘానికి సంబంధించిన బీఎల్‌ఓ యాప్, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ తాజాగా తీసుకొచ్చిన మార్పులు కొత్తగా చేర్చిన వాటిపై బీఎల్‌ఓ లకు మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఆర్ఓ రంగారావు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, ఎంపీడీఓ యాదగిరి, ఈపీఐసీ డిప్యూటీ తహసీల్దార్ సంతోష్, మాస్టర్ ట్రైనర్లు అమరేందర్, యోగిబాబు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు